క్లుప్తంగా

రిటైర్డ్ ఎంఈఓకు సన్మానం


రిటైర్డ్ ఎంఈఓ దంపతులను సన్మానిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం రిటైర్డ్ ఎంఈఓ నాగేశప్ప దంపతులకు ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన నాగేశప్ప చిప్పగిరి మండల ఎంఈఓగా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బసవరాజ్, సతీష్, ఇర్ఫాన్, వెంకటేష్ నాయక్, మణికంఠ, మల్లి, లింగ తదితరులు రిటైర్డ్ ఎంఈఓ దంపతులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు.

మంగరాయుడికి వెన్నతో అలంకరణ



ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి శనివారం భక్తుల సాయంతో వెన్నతో అలంకరించారు. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచారి ఆధ్వర్యంలో పూజారి గురురాజ ఆచారి స్వామివారికి భక్తుడు ఇచ్చిన ఏడు కేజీల వెన్నతో అలంకరించారు. అలాగే పంచామృతాభిషేకం గావించారు.

పార్థసారథి గెలిచినప్పటి నుంచే భూ కబ్జాలు


ఎ.నూర్అహ్మద్

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి భూ కుంభకోణాలు ఎక్కువయ్యాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్అహ్మద్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరుసగా భూ కుంభకోణాలు ఆదోని నియోజకవర్గంలో జరగడం, నిందితులు తప్పించుకోవడం శోచనీయమన్నారు. మండలంలోని అలసందగుత్తిలో ప్రభుత్వ భూమి కబ్జా నిందితులను కేసు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. భూకబ్జాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

వాయుపుత్రుడికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉరుకుంద దేవాలయానికి గ్రామస్తుల విరాళం


నగదును అందజేస్తున్న ఉరుకుంద గ్రామస్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఉరుకుంద గ్రామస్తులు చందాలు వేసుకుని రూ.3,29,200 ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు శనివారం రాత్రి అందజేశారు. తమ గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి మహా కుంభాభిషేకం తొలిసారిగా జరుగుతుండటంతో తమ వంతుగా ఆలయ అభివృద్ధికి సహాయం చేయాలన్న దృక్పథంతో అందరు కలిసి ఈ విరాళాన్ని అందజేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకుడు శివన్నస్వామి, గ్రామ పెద్దలు కురుగోడు, చిరంజీవి పలువురు పాల్గొన్నారు.

95.79 శాతం పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో శనివారం పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా జరిగింది. 95.79 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు, 42 వార్డుల వార్డు సచివాలయ ఉద్యోగులు 372 మంది 16,031 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఇంకా 687 మంది పింఛన్ దారులకు అందజేయాల్సి ఉంది. మిగిలిన వారందరికీ సోమవారం పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు.

ప్రణాళికతో చదివితే..

విజయం ‘పది’లం!

- మార్చి 17 నుంచి పదోతరగతి పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు
- ప్రణాళిక బద్ధంగా చదివిస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా మెలకువలు


ఆదోని ఆర్ఆర్ లేబర్‌కాలనీ పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు భవిష్యత్తులో ముందుకు అడుగు వేయాలంటే పదో తరగతి మార్కులే కీలకం. అందుకే విద్యార్థి భవితకు తొలిమెట్టుగా పదో తరగతి అని చెబుతారు. ఇందులో మంచి ఫలితాలను సాధిస్తే ఇంటర్, డిగ్రీ మంచి గ్రూపులను ఎంచుకునే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులతో విజయం సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మెలకువలు చెబుతూ.. ప్రణాళిక బద్ధంగా ఎప్పటికప్పుడు అసైన్‌మెంట్స్, మాక్ టెస్టులు పెడుతూ తరగతులను నిర్వహిస్తూ సాధన చేయిస్తున్నారు.

పరీక్షలకు దగ్గర పడుతున్న సమయం

ఆదోని, పత్తికొండ డివిజని పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 247 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 18,635 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అందులో ఆదోనిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక, గురుకులం, కస్తూర్బా, మోడల్ పాఠశాలల్లో 10,076 మంది ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. పత్తికొండ ప్రాంతంలో 6,245 మంది విద్యార్థులు ఉన్నారు. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలకు రాయడానికి విద్యార్థులకు 42 రోజులు మాత్రమే మిగిలింది. విద్యార్థులు సమయం వృథా చేయకుండా ఒక సమయం, ఒక పద్దతి, ప్రణాళిక బద్ధగా చదువుకుంటే విజయం వరిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అయా పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలను సాధించడానికి ఉపాధాయులు ప్రతి రోజు ఉదయం 8.15 నుంచి 9.15గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటల వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారంలో 5 సబ్జెక్టులకు బోధన అందించి రివ్యూ చేస్తున్నారు.

విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం వేళల్లో పత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వాట్సప్‌లో నమూనా పత్రాలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి మెటీరియల్ రాలేదు కాని కొంత మంది దాతలు స్పందించి 10వ తరగతి మెటీరియల్‌ను అందించారు. దీనికి తోడు ప్రభుత్వం వాట్సప్‌లో పిల్లలను సిద్ధపరచడానికి నమూనా ప్రశ్న పత్రాలను పంపిస్తుంది. ఆ ప్రశ్న పత్రాలను అధారం చేసుకొని విద్యార్థులకు సాధన చేయిస్తున్నాం.

– వెంకటరమణా రెడ్డి, ఉప విద్యాధికారి

పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలి



ఎక్కడా కలవర పడవద్దు. పుస్తకంలోని పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే మంచి మార్కులను సాధించవచ్చు. ఇంగ్లిషులో అయితే ప్రోస్, పొయట్రీలోని పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలి. బార్, ట్రీ డయాగ్రమ్స్‌తో పాటు గ్రామర్, ఒకాబులరీలను బాగా నేర్చుకోవాలి. లాంగ్వేజస్‌లోని హిందీ, తెలుగులోని వివిధ పాఠ్యాంశాలను మంచిగా సాధన చేయాలి. వ్యాకరణ అంశాలు, పద్యభాగంలోని రచయితలు పరిచయాలు వంటి అంశాలను నేర్చుకోవాలి. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయడానికి సద్ధపడాలి.

–అబిదా బేగం, ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు, లేబర్ కాలనీ ఆర్ఆర్ మున్సిపల్ స్కూల్, ఆదోని

ప్రాక్టీస్ చాలా ముఖ్యం



మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులలో ప్రాక్టీస్ అనేది చాల ముఖ్యం. చాలా మంది మ్యాథ్స్ అంటేనే భయపడుతారు. సులభమైన పద్ధతిలో మ్యాథ్స్‌లో మంచి స్కోర్ చేయాలి అంటే సూత్రాలు, త్రిభుజాలను బాగా నేర్చుకోవాలి. అంకమధ్యం, మధ్యగతం, బాహుళకంలను బాగా సాధన చేయాలి. మంచిగా సాధన చేస్తే వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేందుకు అవకాశం ఉంది. భయపడకుండా ప్రణాళిక బద్ధంగా పాఠ్యంశాలను చదవుకోవాలి. అప్పుడే మనం అనుకున్నది సాధించగలుగుతాం.

–మహేష్, గణితం ఉపాధ్యాయుడు, మున్సిపల్ హైస్కూల్, ఆదోని

ప్రశ్నను బాగా చదివి అర్థం చేసుకోవాలి



ముందుగా మనకు ఇచ్చిన ప్రశ్న పత్రాన్ని బాగా చదువుకొని అర్థం చేసుకోవాలి. గత పరీక్షల నమూనా పత్రాలను పరిశీలించి వాటిని అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా సద్ధపడాలి. నమూనా ప్రశ్నపత్రాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ప్రశ్నలకు జవాబు రాసేతప్పుడు ఆందోళన చెందవద్దు. పరీక్షల్లో మనకు సులభతరమైన గ్రాఫ్‌లు, బొమ్మలు ఉంటే వాటిని కచ్చితంగా పొందిపరిచే విధంగా చూసుకోవాలి. చాయిస్ ప్రశ్నల్లో గమనించి ప్రత్యేకంగా జవాబు రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయాన్ని గమనిస్తూ కలవరపడకుండా పరీక్షలను రాసేందుకు సద్ధపడాలి. – సుధాకర్ సైన్స్ ఉపాధ్యాయుడు, నెహ్రూమెమోరియల్ స్కూల్, ఆదోని

ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి

సహజంగా విద్యార్థులకు పరీక్షలంటేనే భయం.. పబ్లిక్ పరీక్షలు అంటే మరింత భయాన్ని కలిగి ఉంటారు. అయితే ముందుగా భయం వీడి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. ఆందోళన, కలవరం, భయం వంటి భావాలను దరిదాపులోనికి రానీయకూడదు. కొన్ని సార్లు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి వ్యాయామం, యోగా, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి. అప్పుడే కొంతవరకు ఒత్తిడిని తగ్గించుకుంటాం. రాత్రివేళల్లో ఎక్కువగా మెల్కొనరాదు. సమయానికి పండుకొని తెల్లవారుజామున చదవడానికి ప్రయత్నించాలి. ఆ సమయంలో వాతవరణం కూడా కలుషితం లేకుండా ఉంటుంది కాబట్టి మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. దీనికి తోడు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి. పౌష్టిక ఆహారం తీసుకుంటే మంచిది.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి



పార్వతీపరమేశ్వరల కళ్యాణంలో చేస్తున్న వేదపండితులు, కల్యాణానికి హాజరైన భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో పద్మశాలి కులబాంధవుల అరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో ఆలయ అర్చకులు వీరేష్ స్వామి, ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దంపతులచే హోమాలు చేపట్టారు. అనంతరం పార్వతిపరమేశ్వరల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పార్వతి పరమేశ్వరల పాదాల చెంత అక్షింతలు వేసి ఆశీర్వదవచనాలు తీసుకున్నారు. కల్యాణోత్సవానికి కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, రిటైర్డ్ డీఎంహెచ్ఈఓ నరసింహులు హజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వై. అంజనేయులు, డాక్టర్ లక్ష్మన్న, జేరుబండి నరసింహులు పాల్గొన్నారు.

- ఆదోని అర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్‌లో వెలిసిన మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు శనివారం పద్మశాలి కుల బంధువులు ఘనంగా జరుపుకున్నారు. మార్కండేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం ప్రధాన రహదారుల్లో స్వామివారి విగ్రహాన్ని రథంలో కూర్చోబెట్టి ఊరేగింపు చేపట్టారు. మహిళలు, చిన్నారులు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మన్న, జక్క వీరేష్, నారాయణమూర్తి, రంగస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న పద్మశాలి కుల బంధువులు

విద్యార్థులకు అండగా ‘ఫీజు పోరు’


ఫీజు పోరుపై చేపట్టే ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని, విద్యార్థుల పక్షాల ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఫీజు పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్పలు తెలిపారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో ఈనెల 5న చేపట్టే ఫీజు పోరు పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం విద్యాదీవెన కింద రూ.2800 కోట్లు, వసతి దీవెన కింద రూ.1100ల కోట్లు ఫీజు బకాయిలను చెల్లించాల్సి వుందన్నారు. బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కళాశాల యాజమాన్యాల ఒత్తిడితో సతమవుతున్నారన్నారు. ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధించడం మొదలు పెట్టారని, దీంతో వారు చదువులకు దూరమయ్యే దుస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజులు చెల్లించలేక విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో నెట్టివేసిందని ఆరోపించారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ఫీజులను చెల్లించడంతో పాటు సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు అందించి సువర్ణ పాలన అందించారని గుర్తు చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 5న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే ఫీజు పోరు ఆందోళన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నందవరం మండల కన్వీనర్ శివప్ప గౌడ్, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

వలసల నివారణకు ఉపాధి పనులు


పూలచింతలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : వలసల నివారణకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని, పనికి తగిన వేతనం చెల్లిస్తామని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో గ్రామస్తులతో ఉపాధి పనులు వినియోగించుకోవాలని సమావేశం నిర్వహించారు. అలాగే పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సంజీవపురం గ్రామాలను సందర్శించి పింఛన్ల పంపిణీ పర్యవేక్షించారు. అనంతరం చిన్నకొత్తిలి గ్రామంలో నెదర్లాండ్ వాటర్ స్కీమ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా సమ్మర్ ఓవర్ హెడ్ ట్యాంకులో నీరు నిల్వ ఉంచుకోవాలన్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ, ఉపాధి కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు దగ్గర పెట్టుకోవాలి

ఆదోని అర్బన్: ప్రతి వాహనదారుడు రోడ్డుపై వాహనాలను నడిపేటప్పుడు వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, లైసెన్సులను వెంట పెట్టుకోవాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులేని వాహనాలకు, యూనిఫాం ధరించని ఆటో డ్రైవర్లకు జరిమానా విధించి వారికి అవగాహన కల్పించారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూర్మనారయణస్వామి, హనుమన్నస్వామికి గంగపూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


అడ్వకేట్స్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: కష్టపడి చదితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అడ్వకేట్లు చంద్రశేఖర్, మురళీకృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే ఘనంగా జరిగింది. అతిథులు మాట్లాడుతూ ప్రస్తుతం యువతను పీడిస్తున్న మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మంచి నడవడిక లేని విద్య ఎంత ఉన్నా ప్రయోజనం సున్నా అన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నీటి సమస్య పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో నీటి సమస్యను పరిష్కరించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్, నవీన్ డిమాండ్ చేశారు. ఎమ్మిగనూర్ సర్కిల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వసతి గృహంలో నీటి సమస్య తలెత్తడంతో విద్యార్థినులు బయటి నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం నుంచి నీరు తెచ్చుకోవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు వరుణ్, విక్రమ్, కిరణ్, వినిల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై క్షేత్రస్థాయి తనిఖీ


పెద్దకడబూరు పొలాల్లో పంట నమోదును తనిఖీ చేస్తున్న తహసీల్దారు శ్రీనాథ్

పెద్దకడబూరు : 2024 – 25 రబీ సీజన్‌లో మండల కేంద్రానికి చెందిన పంట పొలాల్లో వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు చేపడుతున్న పంట నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దారు శ్రీనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు పై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పంట నమోదు అనంతరం రైతుసేవా కేంద్రాలలో నమోదు జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించబడుతుందన్నారు. నమోదు చేసిన పంట, విస్తీర్ణము, నీటి సదుపాయము తదితర వివరాలను రైతులు పరిశీలించుకొని బయోమెట్రిక్ విధానంలో వారి అంగీకారాన్ని వ్యక్తపరచాల్సి ఉంటుందన్నారు. పంటనమోదు వివరాలు సరైనదిగా నమోదు అయితేనే పంటల బీమా పథకం వర్తిస్తుందని చెప్పారు. అదేవిధంగా కందులు క్వింటా రూ.7,550 చొప్పున మార్క్‌ఫెడ్(ఎంఏఆర్‌కేఎఫ్ఈడీ) సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. కందులు అమ్మదలచిన రైతులు రైతుసేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి లీలాసాయి సుభాష్

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని సబ్‌జైలును శనివారం ఆదోని 1వ అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ లీలాసాయి సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీల బరాక్స్, కిచెన్, రేషన్ స్టోర్‌ను పరిశీలించారు. భోజనాలు, వసతులు ఎలా ఉన్నాయో, ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయవాది కల్పించే వెసులుబాటు ఉందని, ఎవరికైనా ఆర్థిక స్థోమత లేని వారు లీగల్ సర్వీసెస్ అథారిటీ తరపున ఉచిత న్యాయవాదిని నియమిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నజీర్అహ్మద్, కారాగార సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పౌర సరఫరా గోదాము తనిఖీ


గోదాములో రేషన్ వివరాలపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఆదోని పౌర సరఫరాల గోదాము పాయింట్‌ను శనివారం సాయంత్రం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ గోదాములో ఉన్న రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏవైనా అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, ఉప తహసీల్దార్ రవీంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందిస్తున్న నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు : బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి... అందు కోసం నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే శనివారం డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ సెక్టర్ల వారీగా స్టేషన్లలో రోల్ కాల్ నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపటమేనని, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఓపెన్ డ్రింకింగ్‌పై ఇకపై నిరంతరం తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అలాగే నేరాల నియంత్రణ కోసం రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. సమస్యలపై స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్డు నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ.. చలానాలు వసూలు చేయాలన్నారు. ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. అలాగే స్టేషన్ల వారీగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి అధికారి చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు వెంకటరామయ్య, బాబుప్రసాద్, ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా జడ్జి కబర్ధి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తదితరులను నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.